సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 4 । జూన్ । 2023



గ్రూప్‌-1 పరీక్షలు ప్రారంభం
ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏపీపీఎస్సీ గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. 10లో



నేటి నుంచి మహిళల టీ20
ఏసీఏ మహిళా టీ 20 లీగ్‌ పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో నాలుగు మహిళా జట్లు పాల్గొననున్నాయి. 10లో



అలరించిన తెలుగమ్మాయిలు
తెలుగింటి సంప్రదాయం ఉట్టిపడే వస్త్రధారణ, హంస నడకలతో ప్రేక్షకుల మనస్సులను మగువలు దోసుకున్నారు. 10లో

న్యూస్‌రీల్‌

సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్‌ కౌన్సిల్‌ సభ్యులు



సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్‌ సంజయ్‌ కిషన్‌ను సన్మానిస్తున్న బార్‌ కౌన్సిల్‌ సభ్యులు

విశాఖ లీగల్‌: విశాఖ పర్యటన కోసం వచ్చిన సుప్రీంకోర్టు రెండో సీనియర్‌ న్యాయమూర్తి జస్టిస్‌ సంజయ్‌కిషన్‌ను శనివారం నగరంలో రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు రోజుల పర్యటనకు నగరానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ఎ.శేషసాయిని వీరు స్వాగతం పలికారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సీనియర్‌ సభ్యుడు ఎస్‌.కృష్ణమోహన్‌, పి.నర్సింగరావు, బైపా అరుణ్‌ కుమార్‌ ఉన్నారు.

విశాఖ పోర్టుకు సేఫ్టీ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న పోర్టు డిప్యూటీ సీఎంఈ రవికుమార్‌,సేఫ్టీ అధికారులు

మహారాణిపేట: సేఫ్టీ ఎక్సలెన్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు విశాఖ పోర్టు అథారిటీకి అవార్డు వరించింది. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని గ్రీన్‌ టెక్‌ ఫౌండేషన్‌ సంస్థ న్యూఢిల్లీలో శనివారం నిర్వహించింది. సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల భద్రత, సంస్థ పురోగతికి, ప్రమాదాలు ఘటనలను సమర్థవంతంగా నిరోధించేందుకు చేపట్టే చర్యలు పరిశీలించి ఏటా గ్రీన్‌ టెక్‌ సంస్థ అవార్డులను ప్రధానం చేస్తుంది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ సీఎంఈ రవికుమార్‌. సేఫ్టీ అధికారులు గ్రీన్‌ టెక్‌ అవార్డును స్వీకరించారు. పోర్టుకు అవార్డు రావడం పట్ల, ఈ ఘనతను సాధించిన సిబ్బందిని పోర్టు చైర్‌పర్సన్‌ డాక్టర్‌ ఎం.అంగముత్తు ప్రశంసించారు.

జిల్లా రెవెన్యూ విభాగంలో బదిలీలు

సాక్షి, విశాఖపట్నం : జిల్లా రెవెన్యూ విభాగంలో బదిలీలు నిర్వహిస్తూ కలెక్టర్‌ డా.మల్లికార్జున శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక తహసీల్దార్‌, 32 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 28 మంది సీనియర్‌ అసిస్టెంట్స్‌, 12 మంది జూనియర్‌ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 28 మంది వీఆర్వోలు, 11 మంది ఓఎస్‌లకు స్థాన చలనం కలిగిస్తూ ఆర్డర్లు జారీ చేశారు.

ఈపీడీసీఎల్‌లో...
తూర్పు ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్‌)లో ఉద్యోగుల్ని బదిలీ చేస్తూ సీఎండీ ఇమ్మడి పృధ్వీతేజ్‌ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేట్‌ ఆఫీస్‌ జనరల్‌ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముప్పల లక్ష్మణరావుని విజయనగరం ఎస్‌ఈ (ఆపరేషన్‌)గా బదిలీ చేశారు. విజయనగరం ఎస్‌ఈ(ఆపరేషన్‌)గా విధులు నిర్వర్తిస్తున్న పాలమూరి నాగేశ్వరరావుని కార్పొరేట్‌ ఆఫీస్‌ జీఎంగా బదిలీ చేశారు. వీరితో పాటు 11 మంది ఈఈలు, 22 మంది డిప్యూటీ ఈఈలు, ఏఈలు, ఏఈఈలు, జూనియర్‌ ఇంజినీర్లకు స్థానచలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

విశాఖ విద్య: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అధికారులు ప్రకటించారు. అర్హులైన ఉద్యోగులు ఈ నెల 7వ తేదీ లోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అనుక్షణం.. అప్రమత్తం

- కలెక్టరేట్‌లో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు
- కోరమండల్‌లో 309 మంది, యశ్వంత్‌పూర్‌లో 33 మంది ప్రయాణం
- కోరమండల్‌లో 183 మంది, యశ్వంత్‌పూర్‌లో 21 మంది సురక్షితం
- ఇప్పటికే విశాఖ చేరుకున్న 41 మంది ప్రయాణికులు
- ఇద్దరు క్షతగాత్రులకు సెవెన్‌హిల్స్‌లో చికిత్స
- ఇంకా లభించని 63 మంది ఆచూకీ
- వారి వివరాల సేకరణలో అధికార యంత్రాంగం తలమునకలు

సాక్షి, విశాఖపట్నం: ఊహకందని ఘోరం.. మాటలకందని విషాదం.. కళ్లుమూసి తెరిచేలోపు.. క్షణాల్లో వందల మంది ప్రయాణికులు మృత్యు ఒడికి చేరుకున్నారు. రైలు ప్రయాణంలోనే శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఒడిశాలోని బహనగా బజార్‌ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో విశాఖకు చెందిన వారు కూడా చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి.. అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి విశాఖపట్నం ప్రాంతానికి చెందిన వారి వివరాలను సేకరించాలని కలెక్టర్‌ డా.మల్లికార్జునను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేసి డీఆర్వో శ్రీనివాసమూర్తికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కోరమండల్‌ ఎక్స్‌ప్రెస్‌, యశ్వంత్‌పూర్‌-హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన విశాఖ జిల్లాకు చెందిన వారి వివరాలను సేకరించారు. ప్రమాదానికి గురైన రెండు



విశాఖ రైల్వే స్టేషన్‌ నుంచి బయటకు వస్తున్న క్షతగాత్రులు

రైళ్లలో రిజర్వేషన్‌ బోగీల్లో విశాఖపట్నం స్టేషన్‌ నుంచి రైలు ఎక్కిన వారు, విశాఖలో రైలు దిగాల్సిన ప్రయాణికులు మొత్తం 342 మంది ఉన్నట్లుగా గుర్తించారు. 10 మంది కంట్రోల్‌ రూమ్‌ బృందం.. ప్రయాణికుల ఫోన్‌ నంబర్లకు కాల్‌ చేసి.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటోంది. కోరమండల్‌ రైలులో 309 మంది ప్రయాణికులుండగా, హౌరాలో 33 మంది ఉన్నారు. వీరిలో 279 మంది వివరాలు తెలియగా.. మిగిలిన 63 మంది ఫోన్లు కలవకపోవడం, లిఫ్ట్‌ చేయకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు తెలియజేయండి
కలెక్టరేట్‌లో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేసి..



క్షతగాత్రుడు లోకేష్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

0891-2590100, 0891-2590102తో పాటు వాట్సప్‌ నంబర్‌గా 91544 05292ను అందుబాటులో ఉంచారు. ప్రయాణికుల సమాచారం కోసం కుటుంబ సభ్యులెవరైనా ఈ నంబర్లకు కాల్‌ చేసి వివరాలు అందిస్తే.. తగిన చర్యలు చేపడతామని కలెక్టర్‌ డా.మల్లికార్జున తెలిపారు. అత్యవసర సేవల కోసం ప్రభుత్వ, ప్రైవేట్‌ అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచామని.. మెడికల్‌ ఎమర్జెన్సీ కోసం ముందుస్తుగా ప్రధాన ఆస్పత్రుల్లో పడకలను కూడా రిజర్వ్‌ చేశామన్నారు. మరోవైపు ప్రమాదంలో సురక్షితంగా బయటపడిన వారు, స్వల్ప గాయాల పాలై ప్రాథమిక చికిత్స తీసుకున్న వారిని స్వస్థలాలకు తరలించేందుకు చెన్నై వరకు ప్రత్యేక రైలు బయలుదేరింది. ఈ రైలులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 41 మంది శనివారం సాయంత్రం విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరిలో ఇద్దరు ప్రయాణికులను చికిత్స కోసం సెవెన్‌ హిల్స్‌ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరూ పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం పణుకువలసకు చెందిన లోకేష్‌, ఆయన భార్య మిన్నీగా గుర్తించారు. జిల్లాకు చెందిన అందరి ప్రయాణికుల యోగక్షేమాలు తెలిసేంత వరకు కంట్రోల్‌ రూమ్‌ అందుబాటులో ఉంటుందని కలెక్టర్‌ తెలిపారు.

వారంతా అదృష్టవంతులే..
ఇదిలా ఉండగా.. ఈ రెండు రైళ్లకు రిజర్వేషన్‌ చేసుకొని.. శుక్రవారం ప్రయాణాన్ని చాలా మంది వాయిదా వేసుకున్నారు. వీరంతా అదృష్టవంతులుగానే భావించాలి. ప్రయాణాన్ని వాయిదా వేసుకున్న వారిలో ఎక్కువ మందికి ప్రమాదానికి గురైన



డీఆర్వో నుంచి క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ మల్లికార్జున

మేయర్‌ దిగ్భ్రాంతి

డాబాగార్డెన్స్‌: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై మేయర్‌ గొలగాని హరి వెంకట కుమారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రైలు ప్రమాదం ఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో హెల్ప్‌ డెస్క్‌లు ఏర్పాటు చేశారన్నారు.



రైళ్లు రద్దుతో స్టేషన్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్న ప్రయాణికులు

బోగీల్లోనే రిజర్వేషన్‌ ఉంది. ఇలా కోరమండల్‌లో 57 మంది ఉండగా.. యశ్వంత్‌పూర్‌-హౌరాలో ఐదుగురు ఉన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు
తాటిచెట్లపాలెం: ఒడిశాలో జరిగిన ఘోర రైళ్ల ప్రమాదం కారణంగా పలు రైళ్లు రద్దు కావడంతో విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్టేషన్‌లో ప్రయాణికులు తమ తదుపరి రైళ్ల కోసం గంటల సమయం నిరీక్షించారు.



విచారణ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ప్రయాణికులు

వాళ్లంతా ఏమయ్యారో..

వివరాలు తెలిసిన ప్రయాణికులను విశాఖకు తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లపై రైల్వే, ఒడిశా ప్రభుత్వ అధికారులతో జిల్లా అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. రెండు రైళ్లలో కలిపి మొత్తం 342 మంది ప్రయాణికులుండగా.. వీరిలో 279 మంది సమాచారం తెలిసింది. మిగిలిన వారు ఎలా ఉన్నారు.. ఎక్కడ ఉన్నారు.? అనే వివరాలు మాత్రం ఇంకా తెలియ రాలేదు. వారిని ఎలా ట్రేస్‌ చేయాలనే అంశంపై కలెక్టర్‌ మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్‌, ఇతర అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వివరాలను సేకరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించారు. జిల్లాకు చెందిన ప్రయాణికుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేపట్టాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు.

విశాఖ నుంచి రాకపోకలు సాగించిన ప్రయాణికులు, వారి యోగక్షేమాల వివరాలివీ..

	కోరమండల్‌ ఎక్స్‌ప్రెస్‌	యశ్వంత్‌పూర్‌-హౌరా ఎక్స్‌ప్రెస్‌
మొత్తం ప్రయాణికులు	309	33
సురక్షితం	183	21
స్వల్ప గాయాలు	11	02
ఫోన్‌కు అందుబాటులో లేని వారు	03	03
టికెట్‌ తీసుకున్నా ప్రయాణించని వారు	57	05
ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ వస్తున్న వారు	22	02
ఫోన్‌ లిఫ్ట్‌ చేయని వారు	33	--

'కోరమండల్‌'లో గాయపడిన వారి వివరాలివీ...
- ఎస్‌-4లో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఎం.సత్యం, ఎం.సాత్విక, ఎం.పద్మావతి
- వెయిటింగ్‌ లిస్ట్‌లో ప్రయాణిస్తున్న రోహిత్‌ కుమార్‌ ఎంబీఎస్‌
- బీ-5లో ప్రయాణిస్తున్న ఉషాదేవి, ఒకే కుటుంబానికి చెందిన కె.అక్కమ్మ, కె.మిన్నీ, కె.లోకేష్‌
- ఆర్‌ఏసీలో ప్రయాణిస్తున్న శిల్పా పాల్‌
- ఎస్‌-3లో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన బి.మాధవరావు, బి.భారతి

యశ్వంత్‌పూర్‌-హౌరాలో గాయపడిన వారి వివరాలివీ..
- ఎస్‌6 కోచ్‌లో ప్రయాణిస్తున్న బి.రవికుమార్‌
- బీ3 కోచ్‌లో ప్రయాణిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ ఎస్‌ఐ

91544 05292

- ఆచూకీ తెలియకపోతే ఫొటో పై నంబర్‌కు వాట్సప్‌ చేయండి
- ప్రయాణికుల వివరాలు సేకరిస్తాం
- కలెక్టర్‌ మల్లికార్జున వెల్లడి



రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ ద్వారా వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: గుట్టలుగా మృతదేహాలు ఉండటం, ప్రమాదం సంభవించి 24 గంటలకు పైగా గడిచిపోవడంతో.. మృత్యుఒడికి చేరుకున్న ప్రయాణికులను గుర్తించడం కష్టసాధ్యంగా మారింది. ప్రయాణికుల జేబుల్లో ఉన్న ఆధార్‌ కార్డులు, ఫోన్లు, టికెట్లు... ఇలా ఉన్న వాటితో కొందరిని గుర్తించారు. మిగిలిన వారి మృతదేహాలు ఛిద్రంగా మారడంతో వారిని గుర్తించడం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖ జిల్లాకు సంబంధించి చాలా మంది ప్రయాణికుల ఆచూకీ ఇంకా లభించ లేదు. వారంతా క్షేమంగా ఉన్నారా లేదా..? ఎక్కడ ఉన్నారు.. ఏదైనా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారా? మొదలైన వివరాలను సేకరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రమాదంలో చిక్కుకుపోయిన వారి ఆచూకీ కనుగొనేందుకు కుటుంబ సభ్యులెవరైనా.. 91544 05292కు వారి ఫొటో, పేరు, ఇతర వివరాలు పంపించాలని కలెక్టర్‌ డా.మల్లికార్జున సూచించారు. ఫొటో, వివరాలను విజయవాడ, ఒడిశా రైల్వే అధికారులు, ప్రభుత్వాధికారులకు పంపిస్తామన్నారు. వాటి ఆధారంగా.. వారు ఎక్కడ ఉన్నారు.. ఎలా ఉన్నారనే వివరాలను సేకరించడం సులభమవుతుందన్నారు. ప్రస్తుతం అందిన సమాచారం మేరకు విశాఖకు చెందిన ప్రయాణికులు దాదాపు క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేశారు.

ఒడిశాకు 4 అంబులెన్సులు

మహారాణిపేట: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రమాదం జరిగిన ప్రాంతానికి నాలుగు అంబులెన్సులు, ఆరు మహా ప్రస్థానం వాహనాలు పంపినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్‌ పి.జగదీశ్వరావు తెలిపారు. రైలు ప్రమాద బాధితుల కోసం రెండు హెల్ప్‌ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే కేజీహెచ్‌, విమ్స్‌, భీమిలిలోని ప్రభుత్వ ఆస్పత్రి, అపోలో, కేర్‌, సెవెన్‌ హిల్స్‌, ఆర్‌.కె. ఒమ్ని, మెడికవర్‌ ఆస్పత్రుల్లో పడకలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు అరెస్ట్‌

రూ.2.35 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం

అల్లిపురం: వేర్వేరు కేసుల్లో నగర క్రైం పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.2.35 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగర పోలీస్‌ కమిషనరేట్‌ సమావేశ మందిరంలో శనివారం విలేకరుల సమావేశంలో పోలీస్‌ కమిషనర్‌ సీఎం త్రివిక్రమ్‌ వర్మ వివరాలు వెల్లడించారు.

ఫోర్ట్‌ టౌన్‌ క్రైం పోలీసులు
ఈ నెల 1వ తేదీన విజయనగరం జిల్లా గోదారివీధికి చెందిన కటారి జయ తన అక్క కుమారుడు వివాహం నిమిత్తం రైల్వే స్టేషన్‌ దరి శ్రీనివాస కళ్యాణ మండపానికి వచ్చారు. రాత్రి 10.30 గంటల సమయంలో మేడపై భోజనం ముగించుకుని కిందకి వస్తుండగా.. వెనుక నుంచి పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలానికి చెందిన పుట్ట సతీష్‌ వచ్చి ఆమె మెడలో గల బంగారు నల్లపూసల దండ, గొలుసు లాక్కొనగా.. ఆమె గట్టిగా పట్టుకోవడంతో దండ ముక్కలైంది. రెండు ముక్కలు బాధితురాలు చేతిలో ఉండగా, మరో రెండు ముక్కలు తీసుకొని నిందితుడు గోడదూకి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు డయల్‌ 100కి ఫోన్‌ చేయటంతో ఫోర్ట్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఫిర్యాదు ఇచ్చిన గంటన్నర లోపే నిందితుడు పుట్టా సతీష్‌ను రైల్వే స్టేషన్‌ ప్రాంతంలో చోరీ సొత్తుతో పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.

త్రీటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో..
రామ్‌నగర్‌ ప్రాంతానికి చెందిన సొండి ప్రసాద్‌ తన కుటుంబంతో కలసి జీవిస్తున్నాడు. గత మే నెల 21వ తేదీ రాత్రి మెయిన్‌ ఎంట్రన్స్‌ గేట్‌ తెరిచి ఇంట్లోనే నిద్రపోయారు. ఉదయం లేవగానే ప్రసాద్‌ భార్య ఇంట్లో బీరువా డోర్లు బార్లా తెరిచి ఉండడాన్ని గమనించింది. బీరువాలో ఉండాల్సిన 7 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి పట్టీలు, సెల్‌ఫోన్‌, ల్యాప్‌టాప్‌ కలసి రూ.1.85లక్షల విలువగల సొత్తు దొంగతనం అయినట్లు గుర్తించారు. త్రీటౌన్‌ క్రైం పోలీసులకు సమాచారం అందజేయటంతో వారు సంఘటనా స్థలానికి క్లూస్‌ టీంతో సహా చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఆత్మకూరి సంతోష్‌కుమార్‌ను సాంకేతిక ఆధారంగా వన్‌టౌన్‌ ప్రాంతం టౌన్‌ హాల్‌ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.1.30 లక్షల విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనివాసరావు ఆన్‌లైన్‌ బెట్టింగులకు అలవాటు పడి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సమావేశంలో క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ క్రైమ్స్‌ డి.గంగాధరం, సీసీఎస్‌ ఏసీపీ బి.సునీల్‌, ఈస్ట్‌ క్రైం సీఐ యర్రంనాయుడు, ఎస్‌ఐలు డీవీ అప్పారావు, ఎస్‌.ఖగేశ్వరరావు, కె.శ్రీను, ఎ.సంతోష్‌కుమార్‌, కె.నెమరంబాబు తదితరులను పోలీస్‌ కమిషనర్‌ సీఎం త్రివిక్రమ్‌ వర్మ నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీస్‌ కమిషనర్‌ త్రివిక్రమ్‌ వర్మ

వైభవోపేతం.. వెంకన్న తెప్పోత్సవం

- నౌకపై పోర్టు వేంకటేశ్వర స్వామి విహారం
- లాంచీలపై అనుసరించిన భక్తజనం



స్వామిని నౌకపైకి ఎక్కిస్తున్న భక్తులు



స్వామి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి



సాగరంలో వేంకటేశ్వరస్వామి నౌకా విహారం

డాబాగార్డెన్స్‌: పాలకడలిలో పవళించి ముల్లోకాలను బ్రోచే నారాయణుడు.. వేంకటేశుడై జలధిలో విహరించిన మనోహర దృశ్యం విశాఖ సాగరతీరంలో ఆవిష్కృతమైంది. సాగరానికి చేరువలోని శృంగమణి శిఖరం ఈ రమణీయ దృశ్యాన్ని చూసి తరించింది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించి భక్తజనకోటి మురిసింది. పోర్టు ప్రాంతంలోని శృంగమణి పర్వతంపై కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన శనివారం సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన హోమాలు, బలిహరణం, తీర్థగోష్టి జరిపారు. సాయంత్రం 4 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలను ముందుగా పల్లకీలో మెట్లమార్గం మీదుగా కిందకు తీసుకువచ్చారు. అనంతరం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో పాటు భక్తులు స్వామి పల్లకీని మేళతాళాలు, అర్చకుల వేదమంత్రాల నడుమ తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న నౌక వరకు తీసుకువచ్చారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన నౌక మీదకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లారు. భక్తులు ప్రయాణించే లాంచీలు అనుసరించగా స్వామి కాసేపు నౌకపై సాగర విహారం చేశారు. అనంతరం స్వామిని తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ తెప్పోత్సవం భక్తులను పరవశింపజేసింది. ఆలయ ఈవో శ్రీనివాస్‌, కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ కొల్లి సింహాచలం, ఆలయ ప్రధానాచార్యులు శ్రీనివాస జగన్నాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలివీ..



వార్షిక తిరు కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పూర్ణాహుతి, చూర్ణోత్సవం, సముద్రస్నానం(చక్రస్నానం), సాయంత్రం 6 గంటలకు ఆరాధన చూర్ణోత్సవం(దొంగల దోపు ఉత్సవం), ధ్వజ అవరోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి మహిళల టీ20

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ మహిళా టీ 20 లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 11వ తేదీ వరకు విజయనగరంలోని నార్త్‌జోన్ అకాడమీతోపాటు వైఎస్సార్ స్టేడియం(ఫైనల్స్)లో జరగనున్న ఈ పోటీల్లో నాలుగు మహిళా జట్లు పాల్గొననున్నాయి. శనివారం వైఎస్సార్ స్టేడియంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపీనాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గతేడాది మహిళా టీ20 లీగ్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించామన్నారు. ఈ లీగ్‌లో సత్తాచాటిన నలుగురు మహిళా క్రీడాకారిణులు ఇండియన్ వుమెన్ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. మరోసారి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ మ్యాచ్‌లను డీడీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుందన్నారు. ఏసీఏ సీఈఓ శివారెడ్డి మాట్లాడుతూ ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి పర్యవేక్షణలో ఏపీలో క్రికెట్ గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఏసీఏ వుమెన్ టీ20 బ్రాండ్ అంబాసిడర్ రష్మిగౌతమ్ మాట్లాడుతూ ఏపీలో మహిళా క్రికెట్‌కు ఏసీఏ ప్రోత్సాహం చాలా బాగుందన్నారు. గతేడాది నిర్వహించిన ఈ లీగ్ నుంచి నలుగురు క్రీడాకారిణులు వుమెన్ ప్రీమియర్ లీగ్‌కు ఆడే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్, విజయనగరం రాయల్స్‌తో పాటు వైజాగ్ డాల్ఫిన్స్ తరపున ఆడేందుకు స్థానిక క్రీడాకారిణులు సమాయత్తమవుతున్నారు. ఈ సీజన్‌లో మరింత మంది వుమెన్ ప్రీమియర్ లీగ్‌కు ఆడేందుకు అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ఏయూక్యాంపస్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించారు. కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులు తనిఖీ చేసిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి డిజిటల్ పరికరాలను అనుమతించలేదు. తొలి రోజు జరిగిన తెలుగు పరీక్ష బాగా రాశామని అభ్యర్థులు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

దొండపర్తి: ఏయూ ఆర్ట్స్ కాలేజ్, ఎకనామిక్స్, కామర్స్ భవనాల్లో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తీరు తెన్నులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పరిశీలించారు. అక్కడ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

అలరించిన తెలుగమ్మాయిలు



తెలుగమ్మాయి పోటీల్లో అలరిస్తున్న మగువలు

బీచ్‌రోడ్డు: తెలుగింటి సంప్రదాయం ఉట్టిపడే వస్త్రధారణ, హంస నడకలతో ప్రేక్షకుల మనసులను మగువలు దోసుకున్నారు. లలిత తెలుగమ్మాయి మెగా ఫైనల్స్ వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం ఘనంగా నిర్వహించారు. పెళ్లయిన వారు, పెళ్లికాని వారికి రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో 500 మంది పాల్గొన్నట్లు నిర్వాహకుడు వీరుమామ తెలిపారు. వారి నుంచి గ్రాండ్ ఫైనల్స్‌కు పెళ్లైన వారు 22 మంది, పెళ్లికాని వారు 13 మందిని ఎంపిక చేశామన్నారు. ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా వీరిలో 10 మందిని వివిధ విభాగాల్లో విజేతలుగా ఎంపిక చేశామని వెల్లడించారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలి

తగరపువలస: పాఠశాలలు తెరిచే నాటికి నాడు-నేడు పనులు పూర్తి చేయాలని సమగ్ర శిక్ష ఈఈ డి.వి.నరసింహారావు అన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో జరుగుతున్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక ఎంఈవోలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలసి భీమునిపట్నం, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో పర్యటించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు.

సుబ్బారెడ్డికి స్వాగతం



టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో ఆయనకు మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ ముఖ్య నాయకులు స్వాగతం పలికారు.

ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల నిర్వహిస్తున్న ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ తత్సమాన విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు. మొత్తం 40 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 4 సీట్లు భర్తీ చేస్తారు. కోర్సు ఫీజు రూ.65,000. సెల్ఫ్ సపోర్ట్ విధానంలో కోర్సును నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 12లోగా http:// audoa. in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని.. పూర్తి చేసి పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అందజేయాలి. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు. దరఖాస్తుతో పాటు రూ.2000 డి.డిని రిజిస్ట్రార్, ఏయూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-అడ్మిషన్ అకౌంట్ పేరుతో చెల్లించాలి. కౌన్సెలింగ్ సమయంలో అదనంగా రూ.600 చెల్లించాల్సి ఉంటుందని ఆచార్య నాయుడు తెలిపారు.